
సాక్షి ఒడిశా

సోమవారం । 20 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.10,550324లు, బంగారం 1గ్రాము 950 మిల్లీగ్రాములు, వెండి 114 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అంతటా క్రికెట్ సందడి

క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా సందడి నెలకొంది. క్రికెట్ అభిమానులంతా టీవీలకు అతుక్కుపోయారు.

- 8లో



కొరాపుట్‌లో విద్యాభివృద్ధి

విద్యారంగంలో కొరాపుట్ జిల్లా ముందుకు దూసుకుపోతోందని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. నువాగాంలో సర్గిఫూల్-2023 పోటీలు నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

టన్ను గోమాంసం సీజ్



పట్టుబడిన గోమాంసం వ్యాన్

బరంపురం : ఛత్రపూర్ జంక్షన్‌లో జాతీయ రహదారిలో గో మాంసం రవాణా చేస్తున్న వ్యాన్‌ను గంజాం భజరంగ్‌దళ్ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఐఐసీ అధికారి జయకుమార్ పట్నాయక్, భజరంగ్‌దళ్ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి నగరంలోకి అక్రమంగా సుమారు టన్ను లోడుతో గోమాంసం వ్యాన్ రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు భజరంగ్‌దళ్ ప్రతినిధులు బొడ్డపల్లి రోడ్డుపై కాపు కాశారు. ఈలోగా ఎదురుగా వస్తున్న టాటా పికప్ వ్యాన్‌ను అడ్డుకొని సోదాలు చేయగా టన్నుకు పైగా గో మాంసం ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న చమ్మఖండి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మాంసం స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌లను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

250 లీటర్ల సారా ధ్వంసం



గొడొపాదర్‌లో సారా బట్టీ

జయపురం: సమితి పరిధిలోని గొడొపాదర్ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారాబట్టీపై ఎక్సైజ్ పోలీసులు దాడులు జరిపారు. 250 లీటర్ల సారాతో పాటు వెయ్యి లీటర్ల ఇప్ప ఊటను ధ్వంసం చేసినట్లు అబ్కారీ అధికారి నీలేంద్ర బిహారి మిశ్రా తెలిపారు. అదే ప్రాంతంలో నిర్వహిస్తున్న మరో నాలుగు బట్టీలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. శనివారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అందిన సమాచారం మేరకు ఈ దాడులు చేపట్టినట్లు చెప్పారు. అప్పటికే తయారీదారులు పరారయ్యారని తెలిపారు. సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు

లైంగిక వేధింపులు అరికట్టాలి



సదస్సులో పాల్గొన్న జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్రా తదితరులు

జయపురం: మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులు అరికట్టాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఫూల్‌బెడ ప్రాంతంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శనివారం మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. కొరాపుట్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్రా, న్యాయ సేవా ప్రదీకరణ జయపురం కార్యదర్శి, జిల్లా లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెనా, కేంద్రాస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రవీంద్రనాథ్ మిశ్ర తదితరులు ప్రసంగించారు.

రైతులకు ప్రయోజనకరంగా సహకార సంఘాలు



ముగింపు సభలో పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

కొరాపుట్: సహకార సంఘాలతో రైతులకు మరింత ఉపాధి లభిస్తుందని నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా అన్నారు. ఆదివారం ఉమెన్స్ కాలేజీ రోడ్డులోని ప్రైవేట్ కన్వెన్షన్ హాలులో సహకార సంఘాల వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ద్వారా రైతులకు అందుతున్న సహాయ సహకారాలు అభినందనీయమన్నారు. రైతులకు ఉపయోగపడేలా సహకార సంఘాలకు భవనాలు నిర్మించడానికి ప్రభుత్వం ఉచితంగా స్థలాలు ఇస్తుందని కలెక్టర్ ప్రకటించారు. నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి మాట్లాడుతూ కేసీసీ బ్యాంకు ద్వారా రైతులకు మరింత సహాయం అందుతుందన్నారు. కొరాపుట్ సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ మాట్లాడుతూ కొరాపుట్, రాయగడ, మల్కన్‌గిరి, నబరంగ్‌పూర్ జిల్లాల్లో బ్యాంక్ సేవలు విస్తరిస్తామన్నారు. సదస్సులో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని తదితరులు పాల్గొన్నారు.

గంజాంలో 'గజ'గజ

- ఆదివాసీ గ్రామాల్లో చొరబడిన ఏనుగులు
- ఆటోడ్రైవర్ మృత్యువాత
- చెల్లాచెదురైన ధాన్యం, చెట్లు
- భయాందోళనలో స్థానికులు



హడపడా గ్రామంలో చొరబడుతున్న ఏనుగుల గుంపు

బరంపురం : గంజాం జిల్లాలో గజేంద్రులు హల్‌చల్ చేశాయి. జగనాథ్‌ప్రసాద్ అటవీరేంజ్ సన్నొఖేముండి బ్లాక్ పరిధిలో హడపడా గ్రామంలోకి ఏనుగుల గుంపు ప్రవేశించి బీభత్సం సృష్టించాయి. ఓ ఆటో డ్రైవర్ ప్రాణాలు కోల్పోగా, పెద్ద ఎత్తున ధాన్యం, చెట్లు నాశనమయ్యాయి. అటవీ అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హడపడా గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రఘునాథ్ మల్లిక్ (40) ప్రయాణికులను ఎక్కించుకుని గోష్ఠ ఆరోగ్య కేంద్రానికి వచ్చాడు. అక్కడకి దగ్గరలో ఏనుగులు ఉన్నట్లు సమాచారం తెలుసుకుని అటువైపుగా వెళ్లగా ఏనుగులు గుంపు ఒక్కసారిగా దాడికి దిగాయి. డ్రైవర్ పరుగులు తీస్తుండగా కింద పడటంతో తల్లి ఏనుగు కోపంతో మల్లిక్‌ని పైకెత్తి పడేసింది. తీవ్రంగా గాయపడిన మల్లిక్‌ను అదే ఆటోలో తొలుత సన్నొఖేముండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంకేసీజీలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అదే రోజు రాత్రి సమీపంలోని లకాడి



లకాడి ప్రాంతంలో సంచరిస్తున్న గజరాజులు



సన్నఖేముండి వద్ద ఆదివాసీ గ్రామం

పర్వత ప్రాంతంలో సంచరిస్తున్న 13 ఏనుగుల గుంపు అడపడా గ్రామంలో చొరబడి బీభత్సం సృష్టించాయి. గ్రామ శివారున ఉన్న వరి ధాన్యం, వృక్షాలను చెల్లాచెదురుగా చేశాయి. సమాచారం తెలుసుకున్న దిగపండి అటవీ రేంజ్ అధికారులు ఆదివారం గ్రామానికి చేరుకున్నారు. ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట ఎక్కడ దాడి చేస్తాయోనని ఆందోళనకు గురవుతున్నారు. అటవీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పూరీ అంతర్జాతీయ..
ఎయిర్‌పోర్టుకు 'గ్రీన్'సిగ్నల్



- పర్యావరణ అనుమతి మంజూరు
- 1,164 ఎకరాల్లో నిర్మాణం

భువనేశ్వర్: పూరీ పట్టణంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. సైట్ క్లియరెన్స్ ఆమోదం పొందిన నెల రోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం పూరీలో జగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్ట్ కోసం అటవీ భూమి వినియోగించేందుకు పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు శాఖ ఆమోదించింది. రూ.5,631 కోట్ల అంచనా వ్యయంతో దాదాపు 1,164.75 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నారు. ఇందులో 68.81 ఎకరాల అటవీ భూమికి అటవీ శాఖ అనుమతినిచ్చింది. ప్రైవేట్ ఆధీనంలో 221.89 ఎకరాలు, మిగిలిన భూమి బ్రహ్మగిరి తహసీల్ పరిధి సిపాసరుబలి, షాండొపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వ భూమి ఉంది. జిల్లా స్థాయి కమిటీ సమాచారం మేరకు విమానాశ్రయ ప్రాజెక్టుకు అటవీ శాఖ అనుమతి లభించింది. ఇప్పటికే ప్రభుత్వ భూమిని గుర్తించి సరిహద్దు గోడ నిర్మించారు. అటవీ శాఖ అనుమతి సైతం లభించడంతో ప్రైవేట్ భూముల సేకరణకు ప్రక్రియ ప్రారంభమైంది. భూమి కోల్పోయిన వారికి బెంచ్‌మార్క్ వెల ఖరారు చేసిన మేరకు పరిహారం చెల్లిస్తారని పూరీ రెవెన్యూ అధికారి తెలిపారు. సిపాసరుబలిలో 153.78 ఎకరాలు, షాండొపూర్‌లో 68.11 ఎకరాల సేకరణకు సంబంధించి చట్టపరంగా భూసేకరణ, పరిహారం, పునరావాసం పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యంతరాలుంటే జనవరి 3లోగా తెలియజేయాలని ప్రజలను కోరింది. అయితే విమానాశ్రయం నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలంలో జనావాసం లేనందున పరిహారం, పునరావాసం అవసరం లేదు. గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాలపై స్టీరింగ్ కమిటీ వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసేందుకు కన్సల్టెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నియమించనుంది. ప్రభుత్వ ప్రతిపాదిత కార్యాచరణ మేరకు అనుబంధ కార్యకలాపాలు సకాలంలో పూర్తయితే వచ్చే ఏడాది ఆరంభంలో పూరీ జగన్నాథ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పనులు ప్రారంభవుతాయని భావిస్తున్నారు.

రద్దీగా బిజూ ఎయిర్‌పోర్టు..

పూరీకి విమాన పర్యాటకులు, యాత్రికుల రాక పుంజుకుంటోంది. దీంతో పూరీ నుంచి 65 కి.మీ దూరంలో ఉన్న స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం రద్దీగా తయారవుతోంది. ఈ నేపథ్యంలో పూరీలో ప్రత్యేకంగా అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం అవసరమని 2021 జనవరి 1న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి విన్నవించారు. మేలో ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రధాని స్వయంగా జోక్యం చేసుకోవాలని కోరారు.

గంజాయిపై ఉక్కుపాదం



రాయగడ: ముడుకునిలో గంజాయి వనాలను ధ్వంసం చేస్తున్న అధికారులు

రాయగడ : గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అటవీ ప్రాంతాల్లో అబ్కారీ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించి గంజాయి సాగును ధ్వంసం చేస్తున్నారు. గుణుపూర్ సబ్ డివిజన్‌లోని గుడారి సమితి ముడుకునిలో 3 ఎకరాలు, బరుకుడిలో 5 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న గంజాయి వనాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. సుమారు 8 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. దాడులు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎక్సయిజ్ సూపరింటెండెంట్ అభిరాం బెహరా తెలిపారు.

392 కేజీల గంజాయి స్వాధీనం..

కొరాపుట్/జయపురం: జాతీయ రహదారి-26లో భాలూపహడ్ సమీపంలో చేపట్టిన తనిఖీల్లో సునాబెడ పోలీసులు పెద్ద ఎత్తున గంజాయి పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సునాబెడ సబ్ డివిజన్ పోలీసు అధికారి మనోజ్ కుమార్ బెహరా తెలిపారు. రెండు వాహనాల్లో 392 కేజీల 580 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పొట్టంగి సమితి పుకాలి గ్రామం మాలివీధికి చెందిన మనోజ్ ఖొర, ధొబా



కొరాపుట్: పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్లు

వీధికి చెందిన బండిసెట్టి రమేష్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. మినీ ట్రక్కు, బొలెరో వాహనాల్లో గంజాయి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు ఈ దాడులు జరిపినట్లు చెప్పారు. నిందితుల వద్ద నుంచి రూ.1010 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పొండెయ్ గ్రామానికి చెందిన అరక్షిత్ మటి, కకీ గ్రామానికి చెందిన రంజన్ ధురియ, అరకు ప్రాంతానికి చెందిన బిశు, మధియలు పరారైనట్లు పేర్కొన్నారు. పట్టుబడిన ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



పాతబస్టాండ్ వద్ద ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బరంపురం : దివంగత ప్రధాని ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయమని డీసీసీ కార్యదర్శి పితావస్ పండా అన్నారు. ఆదివారం బరంపురం గాంధీనగర్ మెయిన్ రోడ్డులో జిల్లా కాంగ్రెస్ భవనంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా పాత బస్టాండ్ ప్రాంగణంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతం జిల్లా కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పండా మాట్లాడుతూ నేటి సమాజానికి ఇందిరా గాంధీ ఆదర్శప్రాయంగా నిలుస్తారని చెప్పారు. అనేక ప్రజాహిత కార్యక్రమాలు, పథకాలు అమలు చేసి అందరి మనస్సుల్లో స్థానం సంపదించారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా యువజన నాయకులు పాల్గొన్నారు.



డీసీసీ కార్యాలయం వద్ద ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న నేతలు

ఆకట్టుకున్న విజ్ఞాన మేళా



పర్లాకిమిడి: వర్షితాదాస్‌ను అభినందిస్తున్న అధికారులు

పర్లాకిమిడి:

భువనేశ్వర్‌లోని డూన్ ఇంటర్నేషనల్ స్కూల్లో శని, ఆదివారాల్లో నిర్వహించిన 31వ రాష్ట్ర స్థాయి విజ్ఞాన కాంగ్రెస్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇందులో పర్లాకిమిడి సరస్వతీ శిశు విద్యామందిర్ విద్యార్థిని వర్షితా దాస్ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి విజ్ఞాన కాంగ్రెస్‌కు ఎంపికైంది. గజపతి జిల్లా నుంచి పపున్ మహారాణా (మహేంద్రగిరి ఉన్నత పాఠశాల), నిరంజన్ ప్రధాన్, ఎ.గౌతమి (జాజిపూర్), మున్నా దొళాయి (ఖరడా) కూడా ప్రతిభ కనబరిచారు. వర్షితాదాస్ జాతీయ విజ్ఞాన కాంగ్రెస్ ప్రదర్శనకు ఎంపికైందని జిల్లా ముఖ్య విద్యాధికారి ప్రదోష్‌కుమార్ నాయక్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ అంపోలు రవికుమార్ తెలిపారు. విద్యార్థిని సరస్వతీ శిశు విద్యామందిర్ హెచ్‌ఎం సరోజ్‌కుమార్ పండా, ఉపాధ్యాయులు అభినందించారు.

జయపురం.: బొరిగుమ్మ 5టీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమితి స్థాయి విజ్ఞాన మేళా ఆకట్టుకుంది. బొరిగుమ్మ బ్లాక్ ఎడ్యుకేషనల్



విజ్ఞానమేళాను సందర్శించిన విద్యాశాఖాధికారులు

అధికారి సచిన్ మల్లిక్ ఈ విజ్ఞాన మేళాను ప్రారంభించారు. అదనపు బ్లాక్ ఎడ్యుకేషనల్ అధికారి సుభాష్ చంద్ర మఝి, ఏబీఈఓ సంజుక్త పండా హాజరయ్యారు. ఐదింటిని ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రాజెక్టులు ప్రదర్శించిన వారిలో బొరిగుమ్మ ఆదర్శ విద్యాలయ విద్యార్థి అభిషేక్ త్రిపాఠీ, కాత్రగడ యూజీహెచ్ పాఠశాల విద్యార్థి అనిల్ కుమార్, ప్రకాశ హత్, కొణగాం యూజీహెచ్ విద్యార్థి సితు హరిజన్, బొరిగుమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థి పవిత్ర పూజారి ఉన్నారు. వీరు త్వరలో జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని బొరిగుమ్మ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిజయానంద పట్నాయక్ తెలిపారు.

జె.కె.పూర్‌లో కాంగ్రెస్ రాస్తారోకో



రోడ్డుపై ఆందోళనకు దిగిన కాంగ్రెస్ నాయకులు

రాయగడ: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాధారణ కార్యదర్శి దుర్గాప్రసాద్ పండా నేతృత్వంలో ఆదివారం జె.కె.పూర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగావళి నది వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు నాయుడుపేట నుంచి జేకేపూర్ వరకు రహదారి అధ్వానంగా ఉందని, మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదన్నారు. కాగా, ఆందోళన ఫలితంగా రాయగడ నుంచి కళ్యాణసింగుపూర్, బిసంకటక్ ప్రాంతాలతో పాటు బరంపురం, భువనేశ్వర్‌లకు వెళ్లాల్సిన వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న రాయగడ తహసీల్దార్ ప్రియదర్శిని స్వాయి, నేషనల్ హైవే రాయగడ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విక్రం పాణిగ్రహిలు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. వారం రోజుల్లో మరమ్మతులు చేపడతామని అధికారులు హామీ ఇవ్వడంతో నిరసనకారులు ఆందోళన విరమించారు. ఆందోళనలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీవితేశ్వర్ రావు, అప్పలస్వామి కద్రక, డోకి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో చర్చలు జరుపుతున్న తహసీల్దార్, ఈఈ

చౌయితి ఉత్సవాలు విజయవంతం చేద్దాం



సమావేశంలో పాల్గొన్న మంత్రి సరక, గొమాంగొ, గిరిధర్ తదితరులు

రాయగడ: ప్రతి ఏడాదిలా ఈసారి కూడా చౌయితి ఉత్సవాలను కలిసికట్టుగా విజయవంతం చేద్దామని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, మంత్రి సరక పిలుపునిచ్చారు. డిసెంబరు 26 నుంచి చౌయితి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రితో పాటు బిజు స్వస్థ్య సమితి ముఖ్య సలహాదారుడు సుధీర్‌దాస్, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగొ, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ, జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్, జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరైతా, జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు , పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. ముందుగా ఏడీఎం రామేశ్వర్ ప్రధాన్ చౌయితి ఉత్సవాల నిర్వహణపై అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. దీనిపై పలువురు స్పందిస్తూ గత ఏడాది ఉత్సవాల ఆదాయం, ఖర్చుల వివరాలు సభాముఖంగా తెలియజేయాలని కోరారు. గత ఏడాది సుమారు రూ.91.92 లక్షలు ఖర్చయిందని చెప్పగా.. 2021లో కేవలం రూ.40 లక్షలు మాత్రమే ఖర్చు కాగా, గత ఏడాది ఇంతమొత్తం ఎందుకు పెరిగిందని జర్నలిస్టు గోపరంజన్ బక్షీపాత్రో ప్రశ్నించారు. గత ఏడాది అడిటింగ్ జరగలేదని సాంస్కృతిక విభాగ అధికారి వివరణ ఇచ్చారు. గత ఏడాది చౌయితి నిధులు దుర్వినియోగమయ్యాయని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని పలువురు కోరారు. త్వరలోనే ఆ వివరాలు వెల్లడిస్తామని అదనపు కలెక్టర్ తెలిపారు. మంత్రి సరక మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధితో పాటు భాషా, సంస్కృతికి అద్దం పట్టేలా ఉత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గత ఏడాది లోపాలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను తిలకించేందుకు వేలాది మంది ప్రజలు తరలివస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ యంత్రాంగం బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్థానిక కళాకారులకు, వ్యాపారులకు, విద్యుత్ అలంకరణ నిర్వాహకులకు ఉత్సవాల్లో అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు.

క్లుప్తంగా

వెలుగు సీఎఫ్ తొలగింపు

సంతబొమ్మాళి: నౌపడ పంచాయతీ పాలనాయుడుపేట గ్రామ సమైక్య సంఘానికి చెందిన వెలుగు సీఎఫ్ పి.సుమలతను గ్రామ సమైక్య సభ్యులు ఆదివారం తొలగించారు. వెలుగు సీఎఫ్ చేతివాటం అనే శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తపై అధికారులు స్పందించారు. గ్రామ సమైక్య సంఘం సభ్యులందరూ ఏపీఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో నౌపడలో సమావేశమయ్యారు. సీఎఫ్ పై వచ్చిన అవినీతి వాస్తవమని తేలడంతో సంఘ సభ్యులంతా తొలగిస్తున్నట్లు తీర్మానం చేసి కాపీని అధికారులకు అందజేశారు. దీంతో సీఎఫ్ సుమతలను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్తమ పర్యాటక రంగాలకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: పర్యాటక శాఖ-2024 అవార్డులకుగాను ఉత్తమ పర్యాటక రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖాధికారి ఎన్.నారాయణరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. వారసత్వ పర్యాటకం, వ్యవసాయ పర్యాటకం, కళాఖండాలు, బాధ్యతాయుత పర్యాటకం, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారితం, వెల్‌నెస్ రంగాలకు సంబంధించిన రంగాల వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, రూరల్.టూరిజం.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని ఆయన తెలియజేశారు. మరిన్ని వివరాలకు 6309942033 నంబర్‌కు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

మాజీ సైనికులకు లైఫ్ సర్టిఫికెట్ మేళా



లైఫ్ సర్టిఫికెట్ల మేళాలో పాల్గొన్న కమాండెంట్ కల్నల్ విక్రాంత్ పాండే

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంని ఉన్న మిలిటరీ క్యాంటీన్ వద్ద ఆదివారం మాజీ సైనికులకు లైఫ్ సర్టిఫికెట్ మేళాను నిర్వహించారు. జిల్లా మాజీ సైనిక సమాఖ్య అధ్యక్షులు కె.పూర్ణచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఆడమ్ కమాండెంట్ కల్నల్ విక్రాంత్ పాండే నేతృత్వంలో సుమారు 25 మంది మాజీ సైనికులు, వీర నారీమణులకు, వీర మాతలకు లైఫ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్వింగ్ సోల్జర్ సుమంత్ సింగ్, స్థానిక మిలటరి క్యాంటీన్ మేనేజర్ తర్రా కృష్ణారావు, జిల్లా సంఘ గౌరవాధ్యక్షులు తమ్మినేని కృష్ణారావు, ఉపాధ్యక్షులు వి.సూర్యనారాయణ, ఏపీ జగన్మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సత్రాం గ్రామానికి చెందిన కొల్లి సింహాచలం తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన కూరగాయలు కొనేందుకు సత్రాం నుంచి అలుదు వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తుండగా నరసన్నపేట నుంచి పాతపట్నం వైపు వెళ్తున్న కారు ఢీ కొనడంతో కాలు విరిగింది. దీంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో శ్రీకాకుళం తరలించారు. కారు డ్రైవర్ పోలాకి సందీప్‌కుమార్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లే ప్రమాదం జరిగిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై హెచ్‌సీ కృష్ణారావు కేసు నమోదు చేసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జాతీయ విద్యా,సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీకాకుళం టీచర్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ విద్యా, సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి ఒకే ఒక్క ఉపాధ్యాయుడు పీవీఎస్ఎన్ మూర్తి పాల్గొని అభినందన పత్రాన్ని అందుకున్నారు. ఈనెల 17 నుంచి 19 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నైనిటాల్‌లోని నేషనల్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ ఫెస్టివల్ ఆఫ్ టీచర్స్ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా నైరా ప్రైమరీ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. 23 రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు పాల్గొనగా.. ఇందులో జిల్లా నుంచి ఈయన ఒక్కరికే అవకాశం లభించడం విశేషం. ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి భగత్ సింగ్ కోషియారీ చేతుల మీదుగా అభినందన పత్రాన్ని అందుకున్నారు. మూర్తిని డీఈఓ కె.వెంకటేశ్వరరావు, డైట్ వమ్మరవల్లి ప్రిన్సిపల్ తిరుమల చైతన్య, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఆర్.జయప్రకాష్, ఏఎంవో నళినీ కాంత్, శ్రీకాకుళం ఎంఈఓ కృష్ణారావు తదితరులు అభినందించారు.

సంచార జాతుల సమస్యలు పరిష్కరిస్తాం

సోంపేట : సంచార జాతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట పట్టణంలోని చౌడేశ్వరి కల్యాణ మండపంలో సంచార జాతుల అభివృద్ధి మండలి ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సంచార జాతుల రాజ్యాంగ హక్కుల జయభేరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పిరియా విజయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

అంతటా క్రికెట్ సందడి



రాజవీధిలో బిగ్ స్క్రీన్‌పై మ్యాచ్‌ను తిలకిస్తున్న క్రికెట్ అభిమానులు



ఖుర్దారోడ్ వీధుల్లో ఫైనల్ మ్యాచ్ సందడి



బిగ్‌స్క్రీన్‌పై క్రికెట్

భువనేశ్వర్/పర్లాకిమిడి: క్రికెట్ ప్రపంచ కప్ - 2023 ఫైనల్ మ్యాచ్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సందడి నెలకొంది. క్రికెట్ ప్రేమికులంతా టీవీలకు అతుక్కుపోయారు. ఎక్కడికక్కడ తెరలు ఏర్పాటు చేసి సామూహికంగా తిలకించి క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారు. అంతకుముందు భారత్ జట్టు ప్రపంచ కప్ గెలవాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం పర్లాకిమిడి రాజవీధిలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి మ్యాచ్ తిలకించారు. ప్రతి ఒక్కరూ మ్యాచ్‌ను వీక్షించడంతో తినుబండారాలు, ఇతర షాపులు మూతపడ్డాయి.

కొరాపుట్‌లో విద్యాభివృద్ధి



చిన్నారులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: కొరాపుట్ జిల్లా విద్యారంగంలో ముందుకు దూసుకుపోతోందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. ఆదివారం బొరిగుమ్మ సమితి నువాగాంలో జిల్లా స్థాయి సర్గిఫూల్-2023 పోటీలు నిర్వహించారు. సర్గిఫూల్ అధ్యక్షుడు, జిల్లా సంక్షేమాధికారి సునీల్‌కుమార్ తండి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అవిభక్త కొరాపుట్ జిల్లా విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, తాజాగా జయపురంలో యూనివర్సిటీ ఏర్పాటు కావడంతో ఆ ఇబ్బందులు తప్పాయని చెప్పారు. ఆదివాసీ సంస్కృతి కళల పరిరక్షణకు నిర్వహిస్తున్న సర్గిఫూల్ ఉత్సవాలను తన నియోజకవర్గంలో నిర్వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా స్వతంత్ర ఆదివాసీ డెవలప్‌మెంట్ పరిషత్ అధ్యక్షుడు చంద్రశేఖర మరిఖ మాట్లాడుతూ ఆదివాసీ, ఎస్సీ విద్యార్థుల ప్రగతికి, సంక్షేమానికి ముఖ్యమంత్రి నవీన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. స్వతంత్ర ఆదివాసీ డెవలప్‌మెంట్ పరిషత్ ద్వారా ఆదివాసీ విద్యా, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. జిల్లా సంక్షేమాధికారి సునీల్‌కుమార్ తండి మాట్లాడుతూ జిల్లా స్థాయి సర్గిఫూల్ ఉత్సవాలకు 14 పంచాయతీ సమితిల నుంచి 161 పాఠశాలలకు చెందిన 1500 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు వివరించారు. 13 విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారిని వచ్చే నెల గజపతి జిల్లాలో జరిగే జోనల్ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు.



సర్గిఫూల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

స్థానిక మాండలికాలతో సమగ్ర వికాసం



శిక్ష్యా భవన్ ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎంపీ అపరాజిత షడంగి

భువనేశ్వర్: పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసానికి పాఠ్యాంశాల్లో స్థానిక మాండలికాలను చేర్చాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక తూర్పు ప్రాంతీయ భాషా కేంద్రం (ఈఆర్ఎల్‌సీ) ఆవరణలో శిక్ష్యా భవన్, హాస్టళ్లు, అతిథి గృహాన్ని ప్రారంభించిన సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడారు. స్థానిక మాండలికాల వినియోగం వల్ల విద్యార్థులు వివిధ సమస్యలను సొంతంగా అర్థం చేసుకోవడం, విమర్శనాత్మక విశ్లేషణలు చేయడం, పరిష్కారాలను కనుగొనడంలో సహాయపడతాయని చెప్పారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్రాల పాఠశాలలు - సామూహిక విద్యా శాఖ దృష్టి సారించాలన్నారు. స్థానిక లక్ష్మీసాగర్‌లో రూ.16 కోట్లతో కేంద్రం ఏర్పాటు చేసిన తూర్పు ప్రాంతీయ భాషా కేంద్రం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ ప్రాంగణంలో 500 మంది కూర్చునేలా పెద్ద ఆడిటోరియం ఉండాలని ప్రతిపాదించారు. భాషలపై సమావేశాలు, పరిశోధన కార్యకలాపాలు, సెమినార్‌ల నిర్వహణకు ఆడిటోరియం ఉపయోగపడుతుందన్నారు. ఇందుకు అవసరమైన నిధులను కేంద్రం మంజూరు చేస్తుందని మంత్రి ప్రకటించారు. కాగా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సీఐఐఎల్), మైసూర్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ), న్యూఢిల్లీ భాషలపై పరిశోధనకు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి.

గ్రంథాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాగరాజు దంపతులు

జయపురం: విద్యారంగ, ప్రజాహిత, సేవా కార్యక్రమాలతో బొరిగుమ్మ ప్రజల హృదయాలను గెలుచుకున్న దివంగత కె.దేవదత్తం దొర జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కె.నాగరాజుదొర గ్రంథాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కుడిగుడ గ్రామంలో తండ్రి పేరిట సుమారు రూ.5లక్షలతో నిర్మించనున్న ఈ లైబ్రరీకి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సతీమణి కె.సునీత దొర, శిశుమందిర ప్రధాన ఆచార్య మమతా మహాపాత్రో, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రపోటీలకు సన్నద్ధం కావాలి



సత్కారం అందుకున్న మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ ప్రతినిధులు, అథ్లెట్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా అథ్లెట్స్ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డేపల్లి నారాయణరావు పిలుపునిచ్చారు. తిరుపతి వేదికగా డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు 42వ ఏపీ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్న నేపథ్యంలో ఆదివారం శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న ఎన్‌జీఓ గెస్ట్ హౌస్ వేదికగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డేపల్లి నారాయణరావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికే సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తూ.. శ్రీకాకుళంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటైన వెంటనే జాతీయ పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. సంఘ ప్రధాన కార్యదర్శి పాలకొండ అప్పారావు మాట్లాడుతూ జిల్లాలో అద్భుతమైన నైపుణ్యం, టైమింగ్ కలిగిన మాస్టర్ అథ్లెట్స్ ఉన్నారని గుర్తుచేస్తు.. రాష్ట్రపోటీలకు సమయం సమీపిస్తున్న దృష్ట్యా సన్నద్ధం కావాలన్నారు. సమీపంలోని క్రీడామైదానాల్లో నిర్దేశించుకున్న ఈవెంట్స్‌లో శిక్షణ పొందాలన్నారు. ఈ సందర్భంగా బొడ్డేపల్లి నారాయణరావు, పాలకొండ అప్పారావు, చల్లా జగదీష్, లింగాల ప్రసాదరావు, జీఎం జ్యోతి, సనపల సారథి, అన్నెపు ఈశ్వరరావు, సుధాకరరావులను ఘనంగా సత్కరించారు. క్రీడాదుస్తులను అథ్లెట్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు ఎం.భాగ్యలక్ష్మి, ఎం.కామయ్య, యశోద, ఆనంద్, జోగారావు తదితరులు పాల్గొన్నారు. మాస్టర్ అథ్లెట్స్‌కు సంఘ పేట్రన్ చౌదరి పురుషోత్తమనాయుడు బెస్ట్ విసెస్ తెలియజేశారు.

ఆకట్టుకున్న నాటిక పోటీలు



కళాకారులకు శాలువాలు కప్పి సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: కొత్తూరులోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల స్థాయి పౌరాణిక, జానపద నాటక పోటీలు ఆకట్టుకున్నాయి.

కొత్తూరుకు చెందిన సూర్యకళా రంగస్థల జానపద కళాకారుల సంక్షేమ సేవా సమాఖ్య సంఘం 5వ వార్షికోత్సవం సందర్భంగా సంఘం వ్యవస్థాపకుడు కె.పార్వతీశం ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం విశాఖపట్నంకు చెందిన వందలాది మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు. కళారంగాన్ని ఆదుకోవాలని వక్తలు కోరారు.

పరిశోధనలే కీలకం

- పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత
- 'సాక్షి'తో శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్ కొత్త డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ

సాక్షి ఇంటర్వ్యూ



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విద్యా సంస్థ(ఆర్‌జీయూకేటీ) కొత్త డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్ ఐదో డైరెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన ఈయన విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయంలో సుదీర్ఘకాలం ప్రొఫెసర్ సేవలందించారు. ఇదే సంస్థలో 2019 నుంచి 2021 వరకు రిజిస్ట్రార్‌గా పనిచేశారు. రిటైరయ్యాక అక్కడే విశిష్ట ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్, విభాగాధిపతి, రీసెర్చ్ డైరెక్టర్, బోర్డాఫ్ స్టడీస్ చైర్మన్ వంటి కీలక బాధ్యతలు నిర్వర్తించారు. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు వంటి పట్టణాల్లో భవన, సివిల్ నిర్మాణ సలహా కమిటీల్లో పనిచేశారు. సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా సుదీర్ఘ అనుభం ఉంది. తన ప్రాధాన్యతలు, లక్ష్యాలను ప్రత్యేకంగా 'సాక్షి'కి వివరించారు.

సాక్షి: శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ నియామకం పట్ల మీ స్పందన?

డైరెక్టర్: ప్రతిష్టాత్మక విద్యా సంస్థకు డైరెక్టర్‌గా అవకాశం రావటం జీవితంలో మైలురాయిగా భావిస్తున్నాను. ఇందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యాభివృద్ధికి కృషి చేస్తాను.

సాక్షి: మీ ముందున్న లక్ష్యాలు?

డైరెక్టర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందాలి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ సంస్థలో చేరుతున్నారు. వారిలో ప్రతిభ వెలికితీయాలి. అప్పుడే వారు అత్యున్నత స్థాయికి చేరుతారు. విద్యార్థులను ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దటం, విద్య, ఉద్యోగ, ఉపాధికి దోహదపడటం, సమాజానికి సైతం విద్య ఉపయోగపడటం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తున్నాం.

సాక్షి: మౌలిక వసతులు, బోధన సిబ్బందిపై మీ అభిప్రాయం?

డైరెక్టర్: ప్రభుత్వం మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తోంది. ఆరు వేల మంది విద్యార్థులకు సరిపడా అకడమిక్, హాస్టల్ భవనాల నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతోంది. రెగ్యులర్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ సైతం విడుదలైంది. పరిశోధన, నూతన ఆవిష్కరణలకు విద్యలో ప్రాధాన్యత పెరుగుతుంది.

సాక్షి: కరిక్యులమ్‌లో ఎటువంటి మార్పులు అవసరం?

డైరెక్టర్: ఇంజినీరింగ్‌లో సిలబస్ కంటే పారిశ్రామిక అవసరాలు కీలకం. విద్యార్థుల్లో నైపుణ్యాలు, పారిశ్రామిక అవసరాలు లక్ష్యంగా విద్య కొనసాగాలి. సిలబస్‌లో అవసరానికి తగ్గ మార్పులు, పరిశ్రమ అవసరాలు తెలుసుకునేందుకు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అమలు వంటివి కీలకం.

సాక్షి: గ్రామీణ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

డైరెక్టర్: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో కష్టపడే తత్వం, విషయ పరిజ్ఞానం ఎక్కువగా ఉంటాయి. వారిలో ఇంగ్లీష్ భాష, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేత పరిజ్ఞానం వంటి అంశాలు పెంపుదలకు ప్రత్యేక దృష్టి పెడతాం. నిష్ణాతులతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం. నైపుణ్యం గల ఇంజినీర్లుగా తీర్చిదిద్దుతాం.

సాక్షి: ప్రస్తుతం ఉన్న వనరులు ఎలా సద్వినియోగం చేసుకుంటారు?

డైరెక్టర్: ప్రస్తుతం ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సేవలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటాం. సమష్టి కృషితో సంస్థను ముందుకు తీసుకువెళతాం.

విద్యతోనే సామాజిక మార్పు సాధ్యం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- జేఎన్‌టీయూ విజయనగరం పాలకమండలి సభ్యుడు దుప్పలకు సత్కారం



దుప్పల వెంకటరావును సన్మానిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం అర్బన్: విద్యతోనే పేదరిక నిర్మూలన, సామాజిక మార్పు సాధ్యమవుతుందని, వైఎస్ జగన్ ప్రభుత్వం కూడా విద్యకు ప్రాధాన్యత ఇస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జేఎన్‌టీయూ విజయనగరం పాలకమండలి సభ్యుడిగా దుప్పల వెంకటరావును ప్రభుత్వం నియమించిన సందర్భంగా ఆదివారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి కన్వెన్షన్ హాల్‌లో గాయత్రి విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు అధ్యక్షతన దుప్పల వెంకటరావును ఆత్మీయంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పేదలకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందని అన్నారు. వివాద రహితునిగా పేరున్న దుప్పల వెంకటరావును జేఎన్‌టీయూ విజయనగరం పాలకమండలి సభ్యునిగా ప్రభుత్వం నియమించడం అభినందనీయమన్నారు.

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. అన్ని రంగాలపై దుప్పల వెంకటరావుకు అవగాహన ఉందని, అలాంటి వ్యక్తికి పాలకమండలి సభ్యునిగా నియమించడం హర్షణీయమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరుదు కల్యాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు తదితరులు మాట్లాడుతూ విద్య, సాంస్కృతిక, సాంకేతిక రంగాల్లో తనదైన ముద్రవేసి అందరివాడుగా పేరుపొందిన దుప్పల వెంకటరావుకు పాలకమండలి సభ్యునిగా ప్రభుత్వం నియమించడం సంతోషకరమన్నారు. దుప్పల వెంకటరావు మాట్లాడుతూ తన ఉన్నతికి తల్లిదండ్రులే కారణమని అన్నారు. ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గుండ అప్పలసూర్యనారాయణ, కూన రవికుమార్, గుండ లక్ష్మీదేవి, నగర ప్రముఖులు డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ కేఎల్ నాయుడు, డాక్టర్ పైడి మహేశ్వరరావు, హనుమంతు కృష్ణారావు, గుంట తులసీరావు, చౌదరి పురుషోత్తమ నాయుడు, దుప్పల రవీంద్రబాబు పాల్గొన్నారు.

అరసవల్లిలో కార్తీక సందడి



ఇంద్ర పుష్కరిణిలో దీపాలు వదులుతూ పూజలు చేస్తున్న మహిళలు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో కార్తీక మాస సందడి కనిపించింది. కార్తీక మాసం తొలి ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలను చేశారు. అలాగే క్షేత్ర పాలకులైన భువనేశ్వరి సహిత రామలింగేశ్వర స్వామిని కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. ఇక ఇంద్రపుష్కరిణిలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి అరటితెప్పలను నీటిలో వదిలారు. ఇక కొందరు భక్తులు కేశఖండన శాలలో తలనీలాలను సమర్పించుకున్నారు. అలాగే మరికొందరు ఆరోగ్యం కోసం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు, ముఖ్యులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసం సందర్భంగా పుష్కరిణి వద్ద దీపాలను వదిలేలా చర్యలు చేపట్టారు. ఆదివారం ఒక్కరోజే వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,51,500, విరాళాల ద్వారా రూ.82,966, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.

క్లుప్తంగా

రామతీర్థంలో వైభవంగా నిత్య పూజలు


వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామ స్వామి దేవస్థానంలో నిత్య పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు ఆదివారం అత్యంత వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాండ హోమం, ఆదిత్య హృదయం, సుదర్శన అష్టకం, సుదర్శన హవనం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద సీతారామ స్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కార్తీక మాసం ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబసమేతంగా అధిక సంఖ్యలో రామతీర్థం విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. పలువురు సందర్శకులు బోడికొండ పైకి వెళ్లి సందడి చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు పాల్గొన్నారు.

బెదరగొడుతున్న ఏనుగులు


ఏనుగుల గుంపును తిలకిస్తున్న గ్రామస్తులు

భామిని: మండలంలోని గజపతినగరం సమీపంలోకి ఆదివారం ఏనుగుల గుంపు చేరుకుంది. గ్రామసమీపంలోని పంటలను ధ్వంసం చేస్తూ, తినివేస్తూ ప్రయాణం సాగిస్తున్నాయి. ఏబీ రోడ్డు పక్కన నాలుగు ఏనుగులు తిష్ట వేయడంతో ప్రజలు, వాహనదారులు బెదిరిపోతున్నారు. ఏనుగుల బారి నుంచి పంట నష్టాన్ని తప్పించాలని రైతులు కోరుతున్నారు.

స్కూల్ గేమ్స్ రాష్ట్ర జట్టు సభ్యులకు ప్రోత్సాహకం


స్కూల్‌గేమ్స్ రాష్ట్రజట్టు క్రీడాకారులతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: అండమాన్ నికోబార్ దీవుల్లో డిసెంబర్ 4వ వారంలో జరిగే స్కూల్ గేమ్స్ అండర్-17 ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి ఆడనున్న ముగ్గురు క్రీడాకారులకు సీతం ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రోత్సాహకాలు అందజేసి ఆదివారం ఘనంగా సత్కరించింది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని ఈ పోటీలలో ప్రతిభ చూపిన పట్టణానికి చెందిన బూర్లి జయసూర్య, ఆదుర్తి చైతన్య, కేసలి ఝాన్సీరాజ్‌లు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని తెలుసుకుని సత్కరించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మజ్జి శశిభూషణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో 'హెచ్‌సీఎల్ టెక్‌బీ' బృందం పర్యటన

- ఉద్యోగావకాశాలపై అవగాహన

విజయనగరం అర్బన్: డిగ్రీ చదువులు పూర్తయిన తరువాత ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయో అవగాహన కలిగించడానికి ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థుల కోసం 'హెచ్‌సీఎల్ టెక్‌బీ' సంస్థ ప్రతినిధులు జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో పర్యటిస్తారని ప్రాంతీయ ఇంటర్మీడియెట్ పర్యవేక్షణ అధికారి (ఆర్‌ఐఓ) మజ్జి ఆదినారాయణ ఆదివారం తెలిపారు. ఇందుకోసం విద్యార్థులు 'హెచ్‌సీఎల్‌టెక్‌బీఈఈ.కాం' వెబ్‌సైట్‌లో పేర్లను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత అన్ని మేనేజ్‌మెంట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులు స్పందించిన విద్యార్థులతో పేర్లను నమోదు చేయించే ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సాయికిరణ్ 96429 73350, గురునాథ్ 77807 54278, యుగేష్ 63003 78377 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

గ్రోత్ సెంటర్‌లో రోడ్ల మరమ్మతు

బొబ్బిలి: బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో అంతర్గత రహదారుల మరమ్మతులను ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ బడగల హరిధర రావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ రహదారుల స్థానంలో రూ.5.50కోట్లతో కొత్త రహదారుల కోసం ప్రతిపాదనలు పంపించామన్నారు. ఆ నిధులు వచ్చేలోగా ఈ రోడ్లకు ఇప్పుడు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో కన్నా ఇప్పుడు హెవీ వెహికల్స్ తిరుగుతుండడంతో రహదారులు మరమ్మతులకు గురైన నేపథ్యంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మరమ్మతు చేయిస్తున్నామన్నారు.

సర్వం శివమయం



శివపూజకు సమయం ఆసన్నమైంది. పవిత్ర కార్తీక మాసంలో హరుని అర్చించేందుకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. తొలి సోమవారం నాడు పరమ శివుడిని అభిషేకించేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. జిల్లాలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలైన శ్రీముఖలింగం, రావివలస, శ్రీకాకుళం ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయంతో పాటు ప్రతి శివాలయాన్ని సిద్ధం చేశారు


టెక్కలి మండలం రావివలస లో కార్తీక మాసం సోమవారం ప్రత్యేక పూజలకు ముస్తాబైన ఎండల మల్లికార్జునస్వామి.

టెక్కలి: ప్రపంచంలోనే అతి ఎత్తైన స్వయం భూలింగంగా విరాజిల్లుతున్న రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక సోమవారం ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. జిల్లా నలుమూలలతో పాటు సుదూర ప్రాంతాలకు చెందిన వేలాది భక్తుల దర్శనానికి అనుకూలంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ మాజీ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, ఉత్సవాల ప్రత్యేకాధికారి వీవీఎస్ నారాయణ, గ్రామ సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, ఎంపీటీసీ మన్నేల కిశోర్‌తో పాటు సభ్యులు, అధికారులు, గ్రామస్తుల పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మల్లన్నతో పాటు పక్కనే ఉన్న సీతకో నేరు, అందులో ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలతో పాటు కొండపై ఉన్న సీతమ్మ

రావివలస సన్నద్ధం

పాదాల పర్ణశాలకు హంగులు దిద్దారు. వీటితో పాటు మల్లన్న ఆలయానికి ఎదురుగా కొండపై వెలసిన శ్రీ లలితాదేవి ఆలయంలో కార్తీకమాస పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆలయానికి చేరుకునే మార్గాలు

ఈ ఎండల మల్లికార్జునుడి ఆలయానికి చేరుకునేందుకు రోడ్డు, రైల్వే మార్గాలు సదుపాయంగా ఉన్నాయి. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం నుంచి టెక్కలి చేరుకుని అక్కడ నుంచి 4 కిలోమీటర్ల దూరంలో గల ఈ ఆలయానికి చేరుకునేందుకు అనేక బస్సులు, ఆటోల సదుపాయం కలదు. రైల్వే మార్గం విషయానికి వస్తే టెక్కలితో పాటు సమీపంలో సుమారు 5 కిలోమీటర్ల దూరంలో


టెక్కలి మండలం రావివలస ఆలయం వద్ద కార్తీక మాసం సోమవారాలు పూజలకు చేసిన ఏర్పాట్లు.

నౌపడ రైల్వే స్టేషన్, 20 కిలోమీటర్ల దూరంలో పలాస రైల్వే స్టేషన్‌కు రైల్వే మార్గంలో చేరుకుని అక్కడ నుంచి బస్సులు, చిన్నపాటి వాహనాల్లో ఈ ఆలయానికి చేరుకోవచ్చు.

కోటేశ్వరుడి కోవెల సిద్ధం

శ్రీకాకుళం కల్చరల్: కార్తీక మాసం మొదటి సోమవారానికి శ్రీకాకుళంలోని బలరామ ప్రతిష్ఠిత ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం సిద్ధమైంది. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుంకరి కృష్ణ, ఆలయ ఈఓ రాధాకృష్ణ, ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి తెలిపారు. కార్తీక మాసంలో దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమిలు పంచరత్నాల వంటివని, ఆ రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అమావాస్య తదుపరివచ్చే త్రయోదశితో కూడిన చతుర్దశినాడు మాస శివరాత్రి సందర్భంగా కూడా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. ఆఖరిదైన నాల్గో సోమవారం స్వామికి 2016 రుద్రాక్షలతో పూజ చేసి అలంకరిస్తామన్నారు. ఉదయం 3గంటల నుంచి ఆలయ ప్రవేశం ఉంటుందని, సాయంత్రం 6 గంటల నుంచి శ్రీరాజరాజేశ్వరీ మహిళా మండలి ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్ర నామ పారాయణ ఉంటుందని తెలిపారు.

ప్రత్యేక ఉచిత క్యూలైన్లు

మొదటి సోమవారాన్ని దృష్టిలో పెట్టుకొని అధికంగా వచ్చే భక్తులు ప్రశాంతంగా దర్శనాలు చేసుకునేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఈఓ తెలిపారు. ఉచిత క్యూలైన్లు, రూ.20 దర్శనాలు, రూ.50లు శీఘ్ర దర్శనాల కోసం, వీఐపీల కోసం ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేశామని, ఉచిత ప్రసాద వితరణ, తాగునీరు కూడా జరుగుతుందని తెలిపారు. నాగావళి నదిని భక్తుల సౌకర్యార్థం కోసం పరిశుభ్రం చేయించామని, భక్తులు ఎండ బారిన పడకుండా షామియానాలు, లైటింగ్, స్వామివారికి నాలుగు సోమవారాలు ప్రత్యేక పూల అలంకరణ ఏర్పాటు చేశామని తెలిపారు. మెడికల్ క్యాంపు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.


అలంకరణలో

ముస్తాబైన ముఖలింగం


శ్రీముఖలింగంలో షామియానాలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం కార్తీక సోమవారం పూజలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగ ముస్తాబు చేశారు. కార్తీక మాసమంతా ఒక ఎత్తు అయితే సోమవారాల్లో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వస్తారు. గత వారం అమవాస్య ఘడియలు ఉండడంతో ఈ వారం భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంటుందని దేవాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆలయ ఆవరణ, లోపలి భాగంలోతోపాటు వారాహి అమ్మవారు, ముందు భాగం, దక్షిణ ద్వారం వద్ద భక్తులకు ఎండ తగలకుండా షామియానాలు ఏర్పాటు చేసినట్లు ఈఓ పి.ప్రభాకరరావు తెలిపారు. అలాగే భక్తులు స్వామివారి దర్శనం సులువుగా చేసుకునేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆదివారం స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సాగు బాట

- విజయవంతంగా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం
- వరితో పాటు కూరగాయల సాగు

పూసపాటిరేగ: సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడిన పూసపాటిరేగ మండలం గోవిందపురం గ్రామానికి చెందిన యువ ఇంజనీర్ పోతినిండి అనంతబాబు తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి సొంత గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సొంత ఊరిలో వ్యవసాయం చేస్తూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు లేకుండా ధాన్యంతో పాటు వివిధ రకాల కూరగాయలు పండిస్తున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో ఆరోగ్యంగా ఉండాలంటే వైద్యులు సైతం సేంద్రియ సాగుతో చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించడంతో ఆయా పంటలకు బాగా గిరాకీ పెరిగింది. గత ఐదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ పండించిన పంటలను తమ ఇంటి వద్ద నుంచే ఆరోగ్యసమస్యలున్న వారికి నామమాత్రపు ధరకే ఆయన విక్రయిస్తున్నారు. ప్రకృతిసాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో గ్రామాల్లో ప్రకృతిసాగుపై రైతులకు ఆసక్తి పెరిగింది.

అరుదైన వంగడాల సాగు

ప్రకృతి సాగులో వరి రకంలో కుంకంసాలు, ఒడిశా బాసుమతి, కాలాబట్టి, నవారా రకం వరిని అనంత బాబు సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సాక్షితో మాట్లాడుతూ సాధారణ సాగులో పంటకాలం 120 రోజులు కాగా ఈ అరుదైన రకం సాగుకు 150 రోజుల సమయం పడుతుంది. ఆయన తెలిపారు. ఆయా సాగులో పంటకోత ప్రయోగం చేయగా ఎకరాకు 20 నుంచి 25 బస్తాలు వరకు దిగుబడి వస్తున్నట్లు చెప్పారు. 10 ఎకరాల్లో వరితో పాటు ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. సేంద్రియసాగు ద్వారా పండించిన వరిని వినియోగిస్తే వ్యాధులు దూరమవుతాని, అలాగే బీపీ, సుగర్, ఆస్తమా వంటి వ్యాధులు నయమవుతాయని చెప్పారు. పురాతన రకాలైన వరికి మార్కెట్లో బాగా గిరాకి ఉన్నట్లు తెలియజేశారు.


అరుదైన కాలాబట్టి రకం వరి పంటకోత ప్రయోగం చేస్తున్న యువ ఇంజనీరు అనంతబాబు, ప్రకృతివ్యవసాయం సిబ్బంది


అనంతబాబు

గ్యాస్ లీకై పేలిన ఇల్లు

- ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురికి తీవ్ర గాయాలు

లక్కవరపుకోట: గ్రామంలోని గవరవీధిలో గ్యాస్ లైకై ఒక ఇల్లు పూర్తిగా పేలిపోయి శ్లాబ్ మొత్తం కూలిపోయింది. ఆ ఇంటి పరిస్థితి బీభత్సంగా మారిపోయి ఇంట్లో నుంచి క్షతగాత్రుల ఆర్తనాదాలు వినిపించడంతో గ్రామస్తులు హతాశులయ్యారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. 10 రోజుల క్రితం పూసపాటిరేగ మండలం నుంచి వలస వచ్చిన తామరాపల్లి వెంకటలక్ష్మి(50), ఆమె కుమార్తె కెల్ల శ్రావణి (30) ఆమె పిల్లలు మోహన్ (10), లాస్య(8), శ్రావణి అన్న కుమార్తె ప్రణవి(7) గవర వీధిలోని ఓ ఇంట్లో అద్దెకు దిగారు. కాగా శనివారం రాత్రి గ్రామంలో గల బంధువుల ఇంట్లో భోజనం చేసి అద్దెకు తీసుకున్న ఇంటికి వచ్చి నిద్రపోయారు. అయితే ఆదివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో వెంకటలక్ష్మి నిద్రలేచి టీ పెట్టేందుకు వంట గదిలోకి వచ్చి లైట్ వేసేందుకు స్విచ్ ఆన్ చేసింది. క్షణాల్లో పెద్ద శబ్దంతో ఇల్లు మొత్తం పేలిపోయింది. ఏం జరిగిందో అర్థం కాలేదు. ఇల్లు పేలిపోతున్న సమయంలో వచ్చిన కొద్దిపాటి మంటల్లో ముగ్గురు చిన్నారులతో పాటు వెంకటలక్ష్మి, శ్రావణిల బట్టలు పూర్తిగా కాలిపోయి గాయాల పాలయ్యారు. ఈ ఇల్లు పేలిపోవడంతో పాటు చుట్టుపక్కల గల 8 ఇళ్ల గోడలు బీటలు వారాయి. బాత్‌రూమ్‌లు ధ్వంసం కాగా కిటికీల అద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. ఇల్లు పేలిన శబ్దం, క్షతగాత్రుల ఆర్తనాదాలు విన్న ఇరుగుపొరుగువారు వెంటనే వచ్చి చూసి క్షతగాత్రులను ఇంట్లో నుంచి బయటకు తీసుకొచ్చి హుటాహుటిన 108 వాహనంలో ఎస్.కోట తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తీసుకెవెళ్లారు. వెంకటలక్ష్మి, శ్రావణిల పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ప్రమాద సమాచారం మేరకు ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో ప్రమాద స్థలానికి వచ్చి గ్యాస్ ధాటికి పేలిపోయిన ఇంటి పక్కనే గల గడ్డివాము కాలిపోతుండడంతో ఆర్పివేశారు. అనంతరం ఫైర్ ఆఫీసర్ ఎస్‌కె.మదీనా మాట్లాడుతూ గ్యాస్ లీక్ అయి ఆ గదిలో తలుపులు, కిటికీలు మూసివేసి ఉండడంతో గ్యాస్ నిండిపోయివదని, అంతలో స్విచ్ ఆన్ చేయగానే వచ్చిన స్పార్క్‌కు ఒక్కసారిగా ఇట్లు పేలిపోయినట్లు తెలిపారు. ప్రమాద వార్త తెలుసుకున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సహాయ కార్యక్రమాలను చేపట్టారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఆమె భర్త రాం ప్రసాద్ ఘటనా స్థలాన్ని సందర్శించి విచారం వ్యక్తం చేశారు.

ఫోన్‌లో పరామర్శించిన ఎమ్మెల్యే కడుబండి

విజయగరంలో చికిత్స పొందుతున్న బాధితులను ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు పరామర్శించి అమెరికాలో ఉన్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు క్షతగ్రాతుల పరిస్థితిని వివరించడంతో ఎమ్మెల్యే స్పందించి క్షతగాత్రులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని, అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మరింతగా ఆదుకునేందుకు కృషి చేస్తానని బాధితులకు ధైర్యం చెప్పారు.


క్షతగాత్రులను 108 వాహనంలో తరలిస్తున్న సిబ్బంది


పూర్తిగా ధ్వంసమైన ఇల్లు, సామగ్రి

యాప్‌లతో దారుణం

- మోసపోతున్న యువత



పార్వతీపురంటౌన్: సాంకేతిక విప్లవం కొన్ని సందర్భాల్లో దారి తప్పుతోంది. అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న మొబైల్ టెక్నాలజీ అదే చేత్తో ప్రజల ప్రాణాలను కూడా బలితీసుకుంటోంది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని లోన్ యాప్‌ల నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. వారి వలలో పడి రుణాలు తీసుకున్న అమాయకులు. తిరిగి చెల్లించలేనప్పుడు వారి వేధింపులు తాళలేక తనువు చాలిస్తున్నారు. ఇటువంటి సంఘటనల్లో కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. నిర్వాహకుల వేధింపులు, పరువు, ప్రతిష్టలు రోడ్డున పడతాయనే భయంతో ఆందోళనలో ఏం చేయాలో తెలియక ప్రాణాల పైకి తెచ్చుకుంటున్నారు.



లోన్‌యాప్‌ల నెట్‌ఫొటోలు

'ఈజీ రుణంతో వల

- లోన్ యాప్‌లో రుణం కోసం ఎటువంటి హామీ అవసరం లేదు.
- మొబైల్ ఉండి, లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది.
- హామీ లేకుండా రూ.2,000 నుంచి రూ.50 వేల వరకూ యాప్‌లో లోన్ ఇస్తుంటారు.
- రుణం చెల్లింపుల్లో ఒక్క రోజు ఆలస్యమైనా లోన్ యాప్ నిర్వాహకులు ఉపేక్షించరు.
- లోన్ యాప్ డౌనలోడ్ చేసుకోవడం ద్వారా మొబైలోని వ్యక్తిగత డేటా (సమగ్ర సమాచారం) నిర్వాహకుల గుప్పిట్లోకి వెళ్లిపోతుంది.

అపరిచిత యాప్‌లపై అప్రమత్తం



చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో మనకు తెలియని అపరిచిత యాప్ కనిపిస్తే అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రతి యాప్‌ను ఆయాచితంగా క్లిక్‌చేసే అలవాటుతో ఇబ్బందులు కొని తెచ్చుకుంటారు. అడ్డుగోలుగా లోన్ యాప్‌లోకి వెళ్తే మీ వ్యక్తిగత సమాచారం వారి గుప్పెట్లోకి వెళ్తోంది. మోసపూరితంగా ఉంటున్న లోన్‌యాప్‌ల జోలికి దయచేసి వెళ్లొద్దు. నిర్వాహకులు వేధిస్తుంటే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమే కాకుండా సంబంధిత బ్యాంకు అధికారులను కూడా సంప్రదించాలి.

– జి మురళీధర్, డీఎస్పీ, పార్వతీపురం

'హామీ లేకుండా రుణాలతో వల

మీ మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. 'హామీ లేకుండానే రుణం పొందండి' అంటూ లోన్ యాప్స్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు ఇవి. హామీ అవసరమే లేదనడంతో పేద, మధ్యతరగతి వర్గాల వారు ఆకర్షితులై తమ మొబైల్ లో యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. వివరాలు ఇవ్వడమే ఆలస్యం. క్షణాల్లో రూ.50 వేల లోపు రుణం ఖాతాలో జమైపోతుంది. రుణం ఇచ్చేటప్పుడు హుందాగా వ్యవహరించే నిర్వాహకులు చెల్లించడం ఒక్కరోజు ఆలస్యమైనా బెదిరింపులు, వేధింపులకు దిగుతున్నారు. డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడే మొబైలోని కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు సహా అన్నింటికీ యాప్ నిర్వాహకులకు యాక్సెస్ ఇవ్వాలి. లేదంటే రుణం రాదంటారు. యాక్సెస్ ఇవ్వగానే రుణం తీసుకున్న వారి రుణ యాప్ సర్వర్లకు అనుసంధానమవుతుంది. అవసరార్థం అప్పు ఇస్తే చాలనుకునే సందర్భంలో షరతులు, నిబంధనలను చూసుకోకుండానే చాలామంది అంగీకరిస్తున్నారు. అదే వారి పాలిట యమపాశమవుతోంది.

సంగమేశ్వరస్వామి దర్శనం..

సర్వపాప హరణం

- సంగాంలో బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం
- అలహాబాద్ తరహాలో త్రివేణి సంగమం ప్రత్యేకత
- నేడే తొలి కార్తీక సోమవారం

వంగర: అక్కడ శివలింగ దర్శనం సర్వపాప హరణం. కార్తీక మాసంలో సంగమేశ్వరుడిని దర్శించుకుంటే మోక్షం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వంగర మండలం సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి దేవాలయానికి కార్తీకమాస వేళల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ద్వాపర యుగంలో బలరాముడు ఏకకాలంలో ప్రతిష్ఠించిన ఐదు శివలింగాల్లో ఇక్కడిదొకటి. అందువలన ప్రత్యేకత సంతరించుకుంది.

త్రివేణి సంగమం స్నానం పావనం

ఈ ఆలయ ప్రాంగణంలో నాగావళి, సువర్ణముఖి, వేగావతి మూడు నదులు కలిసే కూడలి ఉంది. ఈ ప్రాంతం త్రివేణి సంగమంగా గుర్తింపు పొందింది. ఇక్కడ భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి సంగమేశ్వరుడిని దర్శించుకుంటే పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్ తరహాలో ఈ ప్రదేశంలో మూడు నదులు కలిసే కూడలి ఉంది. సంగమేశ్వస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించి సంగమేశ్వరుడిని దర్శించుకుంటే మోక్షం కలుగుతుందని భక్తులు ప్రగాఢ విశ్వాసం. దీంతో ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కార్తీక మాసంలోని అన్ని రోజుల్లో భక్తులు ఇక్కడకు వచ్చి త్రివేణి సంగమంలో స్నానం ఆచరించి సంగమేశ్వరస్వామిని దర్శనం చేసుకుంటారు.

పితృదేవతలను స్మరించే స్థలం

మూడు నదులు కలిసే త్రివేణి సంగమం ఒడ్డున పితృదేవతలకు కూడా ప్రత్యేక పూజలు అర్పిస్తారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న 400 సంవత్సరాల నాటి భారీ మర్రి వృక్షం ఉంది. ఈ చెట్టు నీడన వంటా వార్పు చేసి త్రివేణి సంగమంలో పితృదేవతలకు పిండ ప్రధానాలు చేస్తారు. అలా చేస్తే మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని భక్తులు నమ్ముతారు.

ఇలా చేరుకోవాలి..

రాజాం పట్టణానికి 23 కిలోమీటర్ల దూరంలో సంగాం ఉంది. వంగర, రుషింగి, కొప్పర గ్రామాలకు వెళ్లే బస్సులు ఎక్కితే మెట్ట మగ్గూరు వద్ద దిగి అక్కడ నుంచి ఆటోలో సంగాం చేరుకోవచ్చు. ఉదయం 7.15, 8.00, 9.00, 11.00 గంటలకు, మధ్యాహ్నం 3, 4.30, 6గంటలకు రాజాం కాంప్లెక్స్ నుంచి బస్సులు ఉన్నాయి. అదే విధంగా రాజాం నుంచి సంగాం వరకు ఆటోలు కూడా విరివిగా ఉంటాయి. 50 నిమిషాల ప్రయాణం ఉంటుంది.

ఎం.సీతారాంపురంలో 108 స్తంభాల ఆలయం

ఇక్కడ 108 స్తంభాల శివాలయం ప్రసిద్ధి. 450 ఏళ్ల క్రితం దీనిని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన వారు నిర్మించారని పూర్వీకులు చెబుతారు. ఆలయం లోపల ఉన్న 108 స్తంభాలతో గుడి గోపురం ఇమిడి ఉంది. ఆలయ కుడ్యాలపై వెలసిన దేవతామూర్తులు విగ్రహాలు అందరినీ ఆకట్టుకుంటాయి. దీంతో కార్తీక మాసంలో పూజల కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.


కార్తీకంలో త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


బలరాముడు ప్రతిష్ఠించిన శివలింగం